క్లుప్తంగా

హనుమంత వాహనంపై రామయ్య ఊరేగింపు



పొదలకూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు సీతారాములు హనుమంత వాహనంపై ఊరేగారు. పడమటి వీధి వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. బాణసంచా, మేళతాళాల నడుమ స్వామి, అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

విష్ణాలయంలో పూజలు



మనుబోలు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత విష్ణాలయంలో ఏకాదశ పూజలను మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు మాధవగిరి హనుమాచార్యులు సూర్యోదయానికి ముందే స్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం సుప్రభాత సేవ చేశారు. స్నపన తిరుమంజనం, తులసీదళార్చన జరిపించారు. అనంతరం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలకు దుగ్గన సురేష్, రమేష్ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

గడ్డివామి దగ్ధం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని దుర్గానగర్‌లో గడ్డివామి మంగళవారం దగ్ధమైంది. బాధితుడు సంపత్ మురళి వివరాల మేరకు.. గేదెల కోసం పదెకరాల్లో ఎండు గడ్డిని సేకరించి ఇంట్లో వామిగా వేశామని తెలిపారు. ఈ క్రమంలో మంటలు చెలరేగి గడ్డివామి దగ్ధమైందని చెప్పారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.

క్యాంపస్ ఎంపికలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఎంపికలను మంగళవారం నిర్వహించారు. లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడారు. ఉద్యోగాలను 78 మంది సాధించారని, ఫైనల్ రౌండ్‌కు 30 మంది ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం ఉద్యోగాలు పొందిన వారిని అభినందించారు. ప్రిన్సిపల్ చిరంజీవి, లక్ష్య ఫౌండేషన్ హెడ్ యామిని తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్ శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం కూడా వివిధ పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఘనంగా రజత్‌కుమార్‌రెడ్డి జన్మదినం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలోని ఇస్కపాళెంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. పార్టీ నేతలు కోడూరు మధుసూదన్‌రెడ్డి, అనిల్, ఆదిశేషయ్య, రసూల్, జావీద్, చలపతి, అశోక్, కేఎంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా నీళ్ల వ్యాపారం

- మినరల్ వాటర్‌పై జనం ఆసక్తి
- పుట్టగొడుగుల్లా ప్లాంట్ల ఏర్పాటు
- నిబంధనలకు తిలోదకాలు
- ఎండలు ముదిరితే ఇబ్బందులే..

పొదలకూరు: ఎండలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నీళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. మినరల్ వాటర్‌కు పల్లెలు, పట్టణం అనే తేడా లేకుండా విపరీతమైన గిరాకీ ఏర్పడింది. దీని కోసం ఒక్కో కుటుంబం ప్రత్యేకంగా ఖర్చు చేస్తున్న పరిస్థితులున్నాయి. పొదలకూరు పట్టణంలో 22 వాటర్ ప్లాంట్లున్నాయి. బయటి ప్రాంతాల వారు సైతం శుద్ధి చేసిన నీటిని తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

అందువల్లే..

సాధారణంగా పంచాయతీ ద్వారా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు తాగునీటిని అందించాలి. అయితే వేసవి కాలంలో పట్టణ జనాభాకు సరిపడా పంచాయతీ నిర్వాహకులు నీటిని సరఫరా చేయలేకపోతున్నారు. అనధికారికంగా వందల సంఖ్యలో మోటార్లు ఉండటంతో తాగునీటి సరఫరా పంచాయతీకి కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో మినరల్ వాటర్‌కు డిమాండ్ ఏర్పడింది. చాలామంది ద్విచక్ర వాహనాల్లో క్యాన్లను ప్లాంట్ల వద్దకు తీసుకెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. కొందరు ప్లాంట్ల నిర్వాహకులు ఇళ్లకు క్యాన్లను సరఫరా చేస్తున్నారు. దాదాపుగా 90 శాతం మంది శుద్ధి చేసిన నీటినే వాడుతుండటంతో ప్లాంట్ల నిర్వాహకులకు నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. వేసవిలో వినియోగం బాగా పెరగడంతో సకాలంలో మంచి నీటిని అందించలేకపోతున్నారు.

పట్టించుకోకుండా..

వేసవిలో నీటికి ఉండే డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. దీంతో బరిలోకి దిగిన వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రమాణాలు పాటించకుండా మినరల్ ప్లాంట్లను పుట్టగొడుగుల్లా ఏర్పాటు చేస్తున్నారు. కొన్నింటిలో నిబంధనల్ని పాటించడం లేదని ఆరోపణలున్నాయి. శుద్ధి చేయకుండానే నీటిని అమ్ముకుంటున్నారన్న ప్రచారం ఉంది. ప్లాంట్లు నిర్మించే సమయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. నీటి నాణ్యతపై దృష్టి పెట్టాలి. కాలుష్యాన్ని నియంత్రించాలి. అయితే చాలామంది నిబంధనలకు నీళ్లొదిలి తక్కువ ఖర్చుతో ప్లాంట్లను ఏర్పాటు చేసి నీటిని సక్రమంగా శుద్ధి చేయకుండానే విక్రయాలు సాగిస్తున్నారు. కొందరు ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారం ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని నీటిని అమ్ముకుంటున్నారు.



పొదలకూరు పట్టణంలో వాటర్ ప్లాంట్

పరిశీలించాలి



అధికారులు తరచూ వాటర్ ప్లాంట్లను పరిశీలిస్తే మంచిది. నీటిని ఏ మేరకు శుద్ధి చేస్తున్నారో తెలుస్తుంది. ఆటోల్లో విపరీతంగా నీటి విక్రయాలు జరుగుతున్నాయి. ఇలాంటి చోట్ల నీటి నాణ్యత ఏ మేరకు ఉందో తెలుసుకోవాల్సి ఉంది.

– కె.చలపతిరావు, పొదలకూరు



ఆటోలో క్యాన్ నీటిని తరలిస్తూ..



ఆటోలో నీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేసి విక్రయం

మా భూములు తిరిగి ఇప్పించండి



తహసీల్దార్‌తో చర్చిస్తున్న పైనాపురం దళితులు

ముత్తుకూరు: ప్రభుత్వం 1989లో పట్టాల రూపంలో పంపిణీ చేసిన భూములను జీవీకే ప్రాజెక్ట్‌కు సేకరించినట్టు అడంగళ్‌లో చూపిస్తున్నారని, అయితే తమకు పరిహారం ఇవ్వలేదని మండలంలోని పైనాపురం పంచాయతీకి చెందిన దళితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ స్వప్నకు మంగళవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

నాటి జంగిల్ దిబ్బలోని 298, 299 సర్వే నంబర్లలోని భూములను తమకు పంపిణీ చేయగా అందులో వేరుశనగ, సవక, జామాయిల్ సాగు చేసుకున్నట్లు దళితులు వెల్లడించారు. తమకు పరిహారమైనా ఇవ్వాలి, లేకుంటే భూములను అప్పగించాలని కోరారు.

వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న నిర్మల



యల్లాయపాళెంలో..

కొడవలూరు: వెయ్యి రోజుల సంరక్షణపై గర్భిణులు, బాలింతలకు అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల సూచించారు. మండలంలోని వెంకన్నపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలను మంగళవారం ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. వెయ్యి రోజుల పాటు ఎలాంటి ఆహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యవంతులుగా ఉంటారో వివరించారు. పోషక విలువలున్న ఆహారాన్ని ప్రదర్శించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రమణమ్మ, జయశ్రీ, స్వర్ణలత పాల్గొన్నారు.

- యల్లాయపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రం – 2లో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడారు. పోషకాలుండే ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు, గుడ్లను తీసుకోవాలని సూచించారు. మేరీ హెప్సిబా, అంగన్‌వాడీ కార్యకర్త ధనమ్మ పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం జాతీయ రహదారి పక్కన గల అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణాన్ని కనులపండువగా మంగళవారం నిర్వహించారు. కల్యాణాన్ని భక్తులు తిలకించి కానుకలను సమర్పించారు. ఆలయ వ్యవస్థాపకుడు మోపూరు కోదండరామిరెడ్డి పర్యవేక్షించారు.

పెన్షన్ నగదు కోసం మనవడి దాడి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పెన్షన్ నగదు కోసం నాయనమ్మపై మనవడు దాడి చేసిన ఘటన కొట్టాలులో మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన విశ్రాంత ప్రభుత్వోద్యోగి సుబ్బమ్మ కొట్టాలులోని ఓ వృద్ధాశ్రమంలో చేరారు. ఈ క్రమంలో పెన్షన్ నగదు కోసం ఆశ్రమానికి వచ్చిన మనవడు జగదీష్ బాధితురాలిపై కర్రతో దాడి చేశారు. దీనిపై ఆశ్రమ నిర్వాహకుడు రామ్‌సుబ్బారెడ్డి ప్రశ్నించగా, ఆయనపై సైతం దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన వృద్ధురాలు రాములమ్మ గాయపడ్డారు.

సన్నాహక సమావేశం నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలపై సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నామని బీసీ సంక్షేమ, సాధికారిత జిల్లా అధికారి వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ నేతలు, కార్యనిర్వాహకులు హాజరుకావాలని కోరారు.

16న మండల సమావేశం

ముత్తుకూరు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 16వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ నాగమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

బాక్సింగ్ పోటీలకు ఎంపికలు నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బాక్సింగ్ పోటీలకు సంబంధించిన ఎంపికలను పట్టణంలోని సెయింట్ మేరీస్ కళాశాలలో బుధవారం నిర్వహించనున్నామని బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2007, జనవరి ఒకటి నుంచి 2008, డిసెంబర్ 31లోపు జన్మించిన వారు అర్హులని చెప్పారు. ఎంపికైన వారు విశాఖపట్నంలో ఈ నెల 12, 13న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ బదిలీ

పొదలకూరు: ఎంజీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ మధుసూదన్ బదిలీ అయ్యారు. ఈయన నాలుగేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నారు. ఏపీఓల కౌన్సెలింగ్‌లో ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో వెంకటాచలం ఏఈఓ శిరీషాను ఇన్‌చార్జిగా నియమించారు. ఏఈగా రాపూరు నుంచి గిరిధర్ వచ్చారు. ఇక్కడ టీఏగా పనిచేస్తున్న సాయిను వెంకటాచలానికి బదిలీ చేశారు. టీఏ త్రిబునేష్‌బాబును ఇటీవల జరిగిన సోషల్ ఆడిట్‌లో డ్వామా పీడీ సస్పెండ్ చేశారు. ఇక్కడ టీఏగా పనిచేస్తూ ఆత్మకూరుకు బదిలీపై వెళ్లిన నాగార్జున కూడా సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే.

చలివేంద్రం ఏర్పాటు

కోవూరు: పడుగుపాడులోని ఎన్టీఎస్ గేట్ వద్ద చలివేంద్రాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. పడుగుపాడు పంచాయతీ కార్యదర్శి హజరత్‌బాబు, జెట్టి మదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే ఏసీల పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): తక్కువ ధరకే ఏసీలను ఇస్తామంటూ మోసగించిన వ్యక్తిపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న జెండా వీధికి చెందిన జాకీర్‌కు ఆన్‌లైన్లో దుర్గానాయుడు అనే వ్యక్తి పరిచయమయ్యారు. రెండు నెలలు వాడిన ఏసీలను తక్కువ ధరకే ఇస్తామని నమ్మబలికారు. దీంతో ఐదు ఏసీలకు సంబంధించి రూ.65 వేలను ఫోన్‌పే ద్వారా జాకీర్ ఈ నెల ఆరో తేదీన పంపారు. కొద్దిసేపటి అనంతరం రూ.మూడు వేలను దుర్గానాయుడు తిరిగి పంపారు. మిగిలిన మొత్తాన్ని మళ్లీ పంపుతానని.. ఏసీలను షోరూమ్‌కు వెళ్లి తీసుకోవాలని జాకీర్‌కు చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన జాకీర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఎస్సై అయ్యప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దంత సంరక్షణపై అవగాహన ర్యాలీ



కొడవలూరులో..

కొడవలూరు: ఓరల్ హెల్త్ డే మాసోత్సవాన్ని పురస్కరించుకొని దంత సంరక్షణపై అవగాహన ర్యాలీని కొడవలూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్య నిపుణురాలు జ్యోతి ప్రభ మాట్లాడారు. ప్రతి పాఠశాలను వైద్య సిబ్బంది సందర్శించి ఓరల్ హెల్త్ సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారని వివరించారు. దంత సమస్యలున్న విద్యార్థుల కోసం పీహెచ్‌సీలో వారంలో ఒకరోజు వైద్యులు అందుబాటులో ఉంటారని వివరించారు. అత్యవసరమైన దంత సమస్యలుంటే కోవూరు సీహెచ్‌సీని సంప్రదించాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు రామకృష్ణ, బాలచంద్రబాబు, హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్ఏలు వెంకట్రావు, షఫీవుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కోవూరులో..

కోవూరు: దంతాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్ర దంత వైద్యురాలు జ్యోతి పేర్కొన్నారు. మండలంలోని ఇనమడుగు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి

తోటపల్లిగూడూరు: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ రాధిక సూచించారు. వరిగొండ వైద్యశాలలో మంగళవారం ఆశా డేను నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ ఎండా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల విషయంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల ఉధృతి కారణంగా వచ్చే వ్యాధులను నియంత్రించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రజలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అశోక్, హెచ్ఈఓ కృష్ణారెడ్డి, సూపర్‌వైజర్ కృష్ణయ్య, పీహెచ్‌సీ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సూచనలిస్తున్న వరిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారులు

గ్యాస్ సిలిండర్ ధరల పెంపు దుర్మార్గం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

తోటపల్లిగూడూరు: గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం దుర్మార్గమని సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య అన్నారు. ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కృష్ణారెడ్డిపాళెం సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చాక పేదలపై మరింత భారాన్ని మోపుతోందన్నారు. గ్యాస్ సిలిండర్, పెట్రోలు, డీజిల్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు. పేద ప్రజల కొనుగోలు శక్తి రోజురోజుకూ క్షీణించుపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలా చేయడం దారుణమన్నారు. ధరలను తగ్గించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మారుబోయిన రాజా, నాయకులు దామవరపు ప్రభావతమ్మ, దామవరపు ఏసుదాసు, మోచర్ల రాధయ్య, కందిపాటి రమణమ్మ, ఈదూరు జానకి, తన్నీరు శ్రావణి, కటకం శ్రీనివాసులు, నెల్లూరు కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ


- పట్టణంలో ఒక్కచోటే ఏడు దేవస్థానాలు
- నిత్యం భక్తుల తాకిడి

పొదలకూరు: పట్టణంలో ఒకే ప్రాంతంలో ఏడు దేవస్థానాలు ఉన్నాయి. ఉత్సవాలు, తిరునాళ్ల సందర్భంగా ఈ ప్రాంతం భక్తులతో నిండిపోతుంది. దాతల సహకారంతో పట్టణవాసులు దేవస్థానాలను నిర్మించారు. ఒకే ప్రాంగణంలో పురాతన కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి (శివాలయం) దేవస్థానం, విఘ్నేశ్వరాలయం, అయ్యప్పస్వామి గుడులున్నాయి. వాటికి అతి దగ్గరగా వెంకయ్యస్వామి మందిరం, పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి గుడి, పోలేరమ్మ, గంగమ్మతల్లి దేవస్థానాలు ఉన్నాయి. వాటిల్లో నిత్యం ధూప, దీప నైవేద్యాలు కొనసాగుతున్నాయి. పోలేరమ్మ, గంగమ్మ దేవాలయాల్లో భక్తులు తరచూ పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.




ఒకే ప్రాంగణంలో ఉన్న శివాలయం, విఘ్నేశ్వరాలయం, అయ్యప్పస్వామి దేవస్థానం

గ్రామం సుఖశాంతులతో ఉండాలని దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వరుణ దేవుడి కరుణ కోసం గంగమ్మకు ప్రత్యేక పొంగళ్లు సైతం పెట్టుకుంటారు. మహాశివరాత్రి పర్వదినం వేలాదిగా భక్తులు ఇక్కడి శివాలయానికి వచ్చి దర్శనం చేసుకోవడంతోపాటు జాగరణ చేయడం ఆనవాయితీ. విఘ్నేశ్వరాలయంలోని పొదలకూరు వినాయకుడంటే చుట్టుపక్కల ప్రాంతంలో నమ్మకం. వినాయకుడి సమక్షంలో ప్రమాణాలు చేసుకోవడం దశాబ్దాలుగా వస్తున్న ఆచారం.



పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం



వెంకయ్యస్వామి దేవస్థానం

హెచ్‌ఎంపై విచారణకు ఆదేశం

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం ఓబులేసుపై విచారణకు కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. విచారణాధికారిగా డీఈఓను నియమించారు. సమాచార హక్కు చట్టం కింద హైస్కూల్ ప్లస్ విషయాలను కోరగా, గడువు ముగిసినా ఇవ్వలేదంటూ గ్రామానికి చెందిన కొండా శ్రీనివాసులురెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ వినతిపై స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. వివరాలు.. హైస్కూల్ ప్లస్‌లోని విషయాలపై ఆర్టీఏ యాక్ట్ ద్వారా సమాచారాన్ని ఇవ్వాలని హెచ్‌ఎంను శ్రీనివాసులు జనవరి 23న కోరారు. దీనికి గానూ రూ.2192 డీడీ చెల్లించాలని హెచ్‌ఎం కోరారు. ఈ మేరకు నార్తురాజుపాళెంలోని యూనియన్ బ్యాంక్ శాఖలో డీడీ తీసి ఫిబ్రవరి 24న ఇచ్చారు. 34 రోజులు గడిచినా ఎలాంటి సమాచారమివ్వలేదు. తాజాగా లేఖ ద్వారా ఈ నెల ఒకటిన మరోసారి కోరగా, అసంబద్ధ విషయాలతో ఈ నెల మూడున వివరాలను రాసి, మార్చి నాలుగునే పేర్కొన్నట్లు చూపిస్తూ శ్రీనివాసులురెడ్డికి పోస్ట్ ద్వారా పంపారు.

వాస్తవ సమాచారమివ్వకపోవడంతో హైస్కూల్ ప్లస్ రికార్డులను స్వాధీనం చేసుకొని ఉన్నతాధికారుల ద్వారా హెచ్‌ఎంపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను శ్రీనివాసులురెడ్డి కోరారు.